## విస్తారా విమానంలో సాంకేతికలోపం

- 20 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన పైలట్
- మరో విమానంలో ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 ( నమస్తే తెలంగాణ ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం టేకాఫ్ అయిన UK-880 విస్తారా విమానంలో టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో పైలట్ 20 నిమిషాలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. సాంకేతికలోపంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి శంషాబాద్‌లోనే విమానాన్ని ల్యాండ్ చేశాడు. ఫ్లైట్‌లో 180 మంది ప్రయాణికులు ఉన్నారని, మెయింటనెన్స్ కారణంగానే అత్యవసర ల్యాండ్ అయినట్టు విస్తారా యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులను వేరే ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు.

## ఉత్కంఠ రేకెత్తించిన ఎయిర్ ఇండియా

**తిరుచ్చిలో సురక్షిత ల్యాండింగ్**

చెన్నై, అక్టోబర్ 11: తమిళనాడులోని తిరుచ్చిలో ఓ ఎయిర్ ఇండియా విమానం ఉత్కంఠకు గురి చేసింది. తిరుచ్చి నుంచి షార్జాకు వెళ్లేందుకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.45కు బయలుదేరిన బోయింగ్ 737 విమానంలో కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని తిరిగి తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవచ్చునని భావించి ఇంధనం ఖాళీ కోసం విమానాన్ని రెండు గంటలపాటు గాలిలో చక్కర్లు కొట్టించారు. తర్వాత బెల్లీ ల్యాండింగ్ చేయించాలని నిర్ణయించగా ల్యాండింగ్ గేర్ పనిచేయడంతో రాత్రి 8.15 గంటలకు విమానం సురక్షితంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండ్ అయ్యింది.

# సోయా రైతుకు సర్కారు టోపీ!

- కేంద్రం కోటాలో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ నిర్ణయం
- ఉత్పత్తి అంచనా 2.60 లక్షల టన్నులు..
- కొనుగోలుకు 56వేల టన్నులే అనుమతి
- మిగిలిన పంటపై చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన బోనస్ కూడా బోగస్సే
- పైగా పంట కొనుగోలుకు క్యాప్ నిబంధనలు
- ప్రభుత్వ నిర్ణయంపై సోయారైతుల ఆగ్రహం



ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబీన్

హైదరాబాద్/ఆదిలాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ఉండగా మార్కెట్లో కేవలం రూ. 3500 నుంచి రూ. 4వేల లోపే ధర పలుకుతున్నది. ఎన్నికల సమయంలో పంట మద్దతు ధరకు అదనంగా రూ.450 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బోనస్ సంగతి దేవుడెరుగు కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూడా వెనకంజ వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కేంద్రం కోటాలోనే కొనుగోళ్లు...

సోయాబీన్ ధరలు పడిపోవడంతో పంట కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర నిబంధనల ప్రకారం మొత్తం ఉత్పత్తిలో 25శాతం అనగా 56,550 టన్నుల సోయాబీన్ కొనుగోలుకు ఆదేశించింది. పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అధికారులు 13 కేంద్రాలు ప్రారంభించి 50 టన్నుల సోయాబీన్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు కాగా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం 56వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించింది. అంటే మిగిలిన 2.04 లక్షల టన్నుల పంటను ఎవరు కొనుగోలు చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వాస్తవానికి మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

### బోనస్ హామీ... బోగసేనా ?

ఎన్నికలకు ముందు సోయాబీన్ పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. నిరుడు మద్దతు ధర రూ. 3950 ఉండగా కాంగ్రెస్ పార్టీ రూ. 4400(రూ. 450 లేదా 11 శాతం బోనస్)లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రస్తుతం సోయాబీన్ మద్దతు ధర రూ. 4892గా ఉండగా అదనంగా రూ. 450 బోనస్ కలిపి రూ. 5342కు కొనుగోలు చేయాలి. ఒకవేళ శాతం ప్రకారం లెక్కిస్తే రూ. 5430 ధరకు కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఏ ధరకూ కొనుగోలు చేయడం లేదు. అంతేగాక అసలే ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులపై ప్రభుత్వం పిడుగు వేసింది. ఎకరాకు 6.52 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ క్యాప్ నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి కోతలు, క్యాప్ పెట్టకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### రూ.22 వేలు నష్టం..



నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయంతో రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తున్నది.

**- రాము, ఖోడద్, తలమడుగు**

### 15 క్వింటాళ్లు మిగులుతుంది



నాలుగెకరాల్లో సోయా వేశా. 40 క్వింటాళ్ల పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్ర మే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు.

**- తిరుమలేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం**



చిట్యాల వద్ద మంటల్లో దగ్ధమవుతున్న లారీ

## బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. పేలిన డీజిల్ ట్యాంకు

- మంటలు చెలరేగి దగ్ధం
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంటు లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

## వీఎన్‌ఈఎస్ లైసెన్స్ రద్దు

**యాజమాన్యం సందేశాలకు స్పందించొద్దు : మహబూబ్ కాలేజ్**

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఎన్‌ఈఎస్) లైసెన్సును రద్దు చేసినట్టు మహబూబ్ కాలేజ్(మల్టీ పర్పస్ హైయర్ సెకండరీ స్కూల్ సొసైటీ) శుక్రవారం ప్రకటనలో వెల్లడించింది. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజ్(ఎస్‌వీపీజీ), బాల్టన్ స్కూల్ వంటి విద్యాసంస్థలు ఇప్పటివరకు వీఎన్‌ఈఎస్ ఆధ్వర్యంలో నడిచాయని, ప్రస్తుతం తమ నియంత్రణలోకి తీసుకున్నట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చినట్టు పేర్కొన్నది. వీఎన్‌ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ కేవీకే రావు, ఆయన కుమారుడుకే శ్రీహర్ష శశాంక్, సభ్యుల జోక్యం, బెదిరింపుల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వీఎన్‌ఈఎస్ సభ్యుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దని సూచించింది.

# ఆర్థరైటిస్‌తో జాగ్రత్త

- సత్వర చికిత్స అవసరం
- తగిన ఆహారం, వ్యాయామం తప్పనిసరి
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ డే..




మహబూబ్‌నగర్, అక్టోబర్ 11 : మనిషి మెట్లు ఎక్కాలన్నా.. దిగాలన్నా.. కింద కూర్చొని లేవాలన్నా.. చివరకు మెల్లగా నడవాలన్నా.. ప్రాణం పోయినంత నొప్పి ఉంటుంది.. దీనినే కీళ్లవాతం, ఆర్థరైటిస్ అంటారు. కేవలం మోకాళ్ల నొప్పులే కాదు శరీరంలోని అన్ని కీళ్లు నొప్పులు చేస్తుంటాయి. చలికాలమైతే ఆర్థరైటిస్ మరింత వేధిస్తుంటుంది. కదలం, మెదలడం కూడా కష్టమే. సకాలంలో సరైన వైద్యం లేకపోతే శాశ్వతంగా రోగగ్రస్థమైనట్లే.. అప్రమత్తంగా ఉండి తగిన ఆహారం, వ్యాయామంతోపాటు మందులు వాడితే ఆపరేషన్ వరకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఆర్థరైటిస్‌పై అవగాహన పెంచేందుకు ప్రతియేటా అక్టోబర్ 12న ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

### కీళ్ల నొప్పుల్లో రకాలెన్నో..

వైద్యశాస్త్రం ప్రకారం దాదాపు వంద రకాల కీళ్ల నొప్పులు ఉన్నాయి. అందరికీ ఈ నొప్పులు ఒకేలా ఉండవు. కొందరికి నొప్పి లేకుండా కూడా కీళ్ల వ్యాధులు ఉండొచ్చు. వయస్సు పెరిగేకొద్ది ఇవి ఎక్కువవుతాయి. కొందరికి మోకాళ్లలో వాపు వస్తుంది. దీంతో అసలు కదలలేరు. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స అందుబాటులోకి వచ్చినా అధిక వ్యయం కారణంగా అందరూ ఆపరేషన్ చేయించలేకపోతున్నారు. ప్రతి నలుగురిలో ఒకరికి కీళ్ల నొప్పులు ఉంటున్నాయి. ప్రతి ఐదుగురిలో ముగ్గురికి తీవ్ర నొప్పులు ఉంటున్నాయి. అస్టియా అర్థరైటిస్, రుమటైడ్ అర్థరైటిస్ ఎక్కువ మందికి సాధారణంగా వచ్చే కీళ్ల నొప్పులు. ఈ రెండు వ్యాధులు రోగ నిరోధక శక్తికి అవరోధంగా ఉంటాయి. కీళ్ల నొప్పులను తొలిదశలోనే గుర్తించాలి.

### చిన్నారుల్లో..

5-15 ఏండ్ల చిన్నారుల్లోనూ పలు రకాల కీళ్ల సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా జువైనల్ రుమటైడ్ అర్థరైటిస్, రుమాటిక్ వంటివి చిన్నారులను వేధిస్తుంటాయి. రుమాటిక్ ఫీవర్‌లో కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి, జ్వరం వచ్చి సరైన సమయంలో చికిత్స పొందకపోతే గుండె సమస్యకు దారి తీయవచ్చు, జువైనల్ రుమాటైడ్ అర్థరైటిస్‌తో బాధపడే చిన్నారుల్లో అన్ని భాగాల్లో నొప్పి ఉంటూ జ్వరం వస్తుంది. ఆకలి బాగా తగ్గుతుంది.

### కాల్షియం, విటమిన్ డీ అవసరం

ఎముకలు గట్టి పడడానికి కాల్షియంతోపాటు విటమిన్ డీ అవసరం. సూర్యరశ్మిలో విటమిన్ డీ ఉంటుంది. రోజంతా నాలుగు గోడల మధ్య ఏసీ గదుల మధ్య ఉండటం వల్ల సూర్యరశ్మి సోకకపోవడంతో విటమిన్ డీ లోపం ఏర్పడుతుంది. కాబట్టి రోజు కాసేపైనా సూర్యకాంతితో ఉండాలి. చదువుకునే పిల్లలు రోజంతా తగరతి గదిలో పాఠాలు వింటూ ఇంటికి వచ్చాక హోంవర్క్ చేసుకుంటూ నీడపట్టున ఉంటారు. దీనివల్ల వారికి ఎండసోకదు మిటమిన్ డీ సమస్య వల్ల చిన్న వయస్సులోనే ఎముకలు గుల్లబారుతాయి. ఎముకల పటుత్వం ఎంత తగ్గిందో తెలుసుకొని మందులు వాడాలి. అదేవిధంగా మహిళల శరీర నిర్మాణంలో ప్రత్యేకత వారి దైనందిన పనితీరు, రుతుక్రమం సరిగ్గా లేకపోవడం థైరాయిడ్ సమస్యల వల్ల హార్మోన్లు తగ్గడం. ఇలా అనేక కారణాల వల్ల ఎముకలు గుల్లబారుతాయి. కొందరు నాజుకుగా ఉండాలని తిండి తగ్గిస్తారు. అందువల్ల పోషకాలు అందవు. లేదా జంక్ ఫుడ్స్ తినడం వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి. అన్నీ కలిసి ఎముకల సమస్యలకు దారి తీస్తాయి.

### కీళ్ల నొప్పులకు కారణాలు

బాక్టీరియల్ ఇన్‌పెక్షన్, వైరస్ ఇన్‌పెక్షన్, జీవక్రియ లోపం వల్ల శరీరంలో రసాయనాల అసమతుల్యత, హార్మోన్స్ అసమతుల్యత, థైరాయిడ్, సోరియాసిస్‌తో వచ్చే నొప్పులు, శరీరంలోని రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల కీళ్ల నొప్పులు వస్తాయి. అధిక బరువు, ప్రమాదాలు, ఎక్కువ సేపు కూర్చోవడం, నిలబడడం, ఆహార విధానంలో మార్పుల వల్ల కీళ్ల నొప్పుల బారిన పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే కీళ్ల నొప్పులు రాకుండా ఉండాలంటే శరీర బరువును నియంత్రించుకోవాలి. కీళ్లపై ఎక్కువ ఒత్తిడి పడకుండా చూసుకోవాలి. అర్థరైటిస్ సమస్య ఉన్న వారు పాలు, పాల ఉత్పత్తులు, తాజా కూరగాయాలు, పచ్చని క్యాబేజి వంటి కూరగాయాలు, ఆకుకూరలు, సోయబిన్ తీసుకోవడంతోపాటు వ్యా యామం కూడా చేయాలి.

### అర్థరైటిస్ కేసులు చాలా పెరిగాయి

జనరల్ దవాఖానకు వచ్చే కేసుల్లో చాలా కేసులు కీళ్ల వ్యాధులతో బాధపడే వారే ఉంటారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయించుకోవాలి. జీవన విధానంలో తగిన మార్పులు చేసుకుంటే నొప్పులు కాస్త తగ్గుతాయి. గతంలో 60 ఏండ్లు దాటినా, వృద్ధుల్లో అధికంగా వచ్చేది. ఇప్పుడు 40 ఏండ్లు దాటిన వారిలో వస్తుంది. బరువు ఎక్కువ్వవడం వల్ల కీళ్ల నొప్పులు వస్తున్నాయి. చిరుదాన్యాలు, పాలు, ఆకు కూరలు తినడం వల్ల చాలా వరకు కీళ్ల నొప్పులు నియంత్రించవచ్చు.

**– డాక్టర్ విజయ్‌కాంత్, ఆర్థోపేడిక్ సర్జన్ నేహాషైన్ దవాఖాన, మహబూబ్‌నగర్**

## విద్యార్థులు, ఉపాధ్యాయులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

మరికల్, అక్టోబర్ 11 : ఇటీవల ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు, అదేవిధంగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను శుక్రవారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నారాయణపేట జిల్లాలో మరికల్, ధన్వాడ మండలా ల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన అవినాశ్, నవ్యశ్రీ, అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన బింధు, కమలాకర్, నర్సింహ, అంజప్ప, శివరాజ్‌లను ఆదర్శంగా తీసుకోని జిల్లాలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, చంద్రప్ప, తిరుపతయ్య, ఆశప్ప, కుర్మయ్య, రాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


## టిప్పరు ఢీకొని వ్యక్తి మృతి

బాలానగర్, అక్టోబర్ 11 : బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) దుర్మరణం చెందాడు. మండల కేంద్రంలోని సంతబజారు పెట్రోలు బంక్ వద్ద బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని గౌతాపూర్ నుంచి మట్టిని తరలిస్తున్న టిప్ప రు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ కిందపడి వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై తిరుపాజీ పరిశీలించి మృతదేహాన్ని జడ్చర్ల దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

వనపర్తి టౌన్, అక్టోబర్ 11 : వనపర్తి జిల్లాలోని సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీలలో ఏఎన్‌ఎం, అకౌంటెంట్ సిబ్బంది నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో గోవిందరాజులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ అమరచింత, రేవల్లి, పెద్దమందడి, ఖిల్లాఘణపురం (జనరల్) పాఠశాలల్లో 4ఏఎన్‌ఎం పోస్టులు, కేజీబీవీ ఆత్మకూరు, రేవల్లి, పెద్దమందడి పాఠశాలల్లో మూడు అకౌంటెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏఎన్‌ఎం పోస్టులకు అర్హతలు ఇంటర్మీడియట్, ఏఎన్‌ఎం సర్టిఫికెట్, అదనపు సర్టిఫికెట్లు, అకౌంటెంట్ పోస్టుకు బీకాం, బీకాం కంప్యూటర్స్, అదనపు క్వాలిఫికేషన్ (ఎంకాం) అర్హత కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 15 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తెలిపారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో గాంధీనగర్ మహిళలు

ఊట్కూర్, అక్టోబర్ 11 : మండలవ్యాప్తంగా శుక్ర వారం మహిళలు బతుకమ్మ వేడు కలను ఘనంగా జరుపు కొన్నారు. వాడ వాడల్లో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మ ఆడారు. మండలకేంద్రంలో పెద్ద చెరువుకు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వేడుకల్లో పాల్గొన్న వారికి అన్నదానం చేశారు.





